# చతుర్ముఖ పురాణం

పేకాట, తాగుడు, వ్యభిచారం — ఈ మూడు దుర్వ్యసనాల్లో ఏది ఆర్థికంగా, నైతికంగా, సాంఘికంగా, మానసికంగా వ్యక్తి పతనానికి త్వరగా దారి తీయగలదో చెప్పవలసి వస్తే, మా వూరును ప్రామాణికంగా తీసికొని "పేకాట" అని సులభంగా చెప్పవచ్చు. పన్నెండేళ్ళ పిల్లలు మొదలు డెబ్భై యేళ్ళ ముసలి వాళ్ళవరకూ ఇప్పుడు మా వూళ్ళో చీట్లపేక వ్యసనానికి తమ సర్వస్వాన్ని ధారాదత్తం చేస్తున్న వాళ్ళు లెక్కకుమించి వున్నారంటే ఆశ్చర్య పడేందుకు వీలులేదు. ఒకరోజున నేనుబస్సుదిగి వూళ్లోకి వస్తుంటే — కార్ఖానా దగ్గర నలుగురూ, కాఫీ హోటలు దగ్గర అయిదుగురూ, మిఠాయి దుకాణం దగ్గర ముగ్గురూ, కిళ్ళీబడ్డీ దగ్గర ఆరుగురూ, రథశాల దగ్గర ఏడుగురూ చీట్లపేక ఆడుతున్నారు. కాలక్షేపానికి కాదు-ఓకుకు అయిదుపైసలో, పదిపైసలో, పావలాయో పెట్టి ఆట ఆడుతున్నారు. అందులో రైతు యువకులున్నారు. షావుకార్లున్నారు. గ్రామపెత్తందార్లున్నారు. ఉద్యోగస్థులున్నారు, నెత్తిన రూపాయి పెడితే అర్థరూపాయికికూడా అమ్ముడుపోని

దసుల్బాజీలున్నారు! ఊళ్లో సెంటు పొలానికికూడా శిస్తుకట్టే పనిలేని బీదవాళ్లున్నారు. శ్మశానాలను కాకట్టుపెట్టి అప్పులు తెచ్చే మొనగాళ్లున్నారు! దుర్వ్యసనాల దుర్గంధంలో మునిగి తేలుతున్న వాళ్లున్నారు. వీళ్ళందరినీ పేకాట ఓ చోట సమా వేశపర్చి మాయా మోహితుల్ని చేసి ఆట ఆడించటం విశేషమే!

పేకాటలోవున్న ఆకర్షణశక్తి మరే వ్యసనంలోనూ వుండదు. అది ఆట ఆడేవాళ్ళకుగానీ అర్థంకాదు. మద్యపానానికి అలవాటైనవారు ఆ వ్యసనం నుంచి తప్పుకోవడం చూశాను; పొగత్రాగేవాళ్ళు మానుకోవడం విన్నాను! అతిగా వ్యభిచరించేవాళ్లు ఆవ్యసనానికి స్వస్తిచెప్పడం జరిగిన దృష్టాంతరాలున్నాయి.

కాని పేకాట ఆడేవాళ్ళు కాయం కట్టెమీద చేరే వరకు ఎప్పుడో ఒకప్పుడు ఆవ్యసనానికి కట్టుబడే వుంటాడు. అక్షరాలా మానివేయడమంటూ వుండదు. చేతిలో డబ్బులున్నప్పుడు మనస్సులో ఓ పురుగు చెట్టును తొలుస్తున్నట్టు తొలుస్తూనే వుంటుంది. ఆ పురుగు తీయని బాధకు వ్యక్తి లొంగిపోయి మనస్సులో గెలుద్దామనే ఆశ కాటి ప్రమాణాన పైకి లేవగా, నడుం కట్టి ముందుకు దూకుతాడు. అదృష్టంపై ఆధారం లేని విశ్వాసంతో పేకాటలోవున్న విచిత్రమేమిటంటే డబ్బులు గెలిచిన వాడితోనూ, డబ్బులు పోగొట్టుకున్న వాడితోను వ్యసనం పట్ల తీవ్రమైన లాలస వృద్ధి చెందుతుంది. గెలిచినవాడికి మరీ ఎక్కువగా గెలుద్దామని పోగొట్టుకున్న

వాడికి పోయినసొమ్ము రాబట్టుకుందామని, ఆ మాయా జూదానికి మా వూరి కుర్రకారు అలవాటై ఆస్తుల్ని, సంసారాల్ని, మనసుల్నీ తగలేసుకోవడం విన్న దగ్గర్నుంచీ నాకెంతో బాధ వేయసాగింది. అసలు పదహూడు ముక్కలాట ప్రచారంలోకి వచ్చిన దగ్గర్నుంచే ప్రజలలో పేకాటపిచ్చి ప్రబలిపోయింది.

మా వూరు వెళ్ళినప్పుడల్లా పేకాట ఆడేవాళ్ళ కథల్ని వినడం మామూలై పోయింది. మా మామయ్య వాళ్ళను గురించి చెబుతూవుంటాడు. ఆయనా తరచు దేవాలయ మండపంమీద పేకాట ఆడుతూవుంటాడు.

ఒకసారి తూర్పువీధి చివరున్న భూషయ్య కొడుకు భార్యను కట్టె పేడు తీసుకొని కొడుతూండడం నేను కళ్ళారా చూశాను – నిమ్మతోట దగ్గరకు వెళుతూ. కారణమేమిటని అక్కడచేరిన వాళ్ళల్లో ఒకాయన్ను అడగ్గా ఏముంది! పేకాట మహాత్మ్యం! ఆవిడ పెళ్ళినాటి బంగారు గొలుసును తాకట్టుపెట్టి రెండొందలు తెచ్చి పేకాటలో పోగొట్టాడట మొగుడు. భార్య అందుకు అదేమని అడగ్గా బడితెపూజ చేస్తున్నాడు అన్నాడు.

నాకు కోపము, జాలీ, బాధ వేశాయి. ఇట్లా ఊళ్లో పండువంటి ఎన్ని సంసారాలు నాశనమౌతున్నాయో! భూషయ్య కొడుకు గడ్డను నమ్ముకొని బ్రతికే అమాయికజీవి. ఈ దుర్వ్యసనానికి దాసుడై ఈ దుస్థితికి దిగజారాడన్నమాట!

ఓ సెలవు రోజున పనిమీద మా వూరు వెడితే మా మామయ్య ఒక దారుణమైన ఉదంతాన్ని చెవిన వేశాడు. సుబ్బారావు బాబాయిగారి రెండో అబ్బాయి అప్పనశాస్త్రి ఎండ్రిన్ పుచ్చుకొని అంతకు క్రితంరోజే ఆత్మహత్య చేసుకున్నాడట. కారణం తెలుసుకున్న మీదట నేను అప్రతిభుడనైనాను. పదమూడు ముక్కలాటకు అలవాటుపడి, వున్న మూడెకరాల పొలం అమ్మివేశాడట. ఇంకా అప్పులున్నాయట. భార్య పేరునవున్న పొలాన్ని అమ్మమని వేధిస్తున్నాడట. ఆమె ససేమిరా ఒప్పుకోలేదట. పిల్లల పోషణకు కావాలని పట్టుబట్టిందట. ఎక్కడా అప్పు పుట్టక, డబ్బుదొరక్క, మూడురోజులు పిచ్చివాడిలా తిరిగి, నాలుగోరోజు ఎండ్రిన్ త్రాగి నీటి బుడగలాంటి జీవితాన్ని సమాప్తి చేసుకున్నాడట.

ఆ దుర్ఘటనకు చకితుణ్ణయినాను. నేను సత్వరం పోలీసు స్టేషనుకు వెళ్ళి సబ్ ఇన్స్పెక్టరు నాయుడితో మా వూళ్ళో స్వైర విహారం చేస్తున్న పేకాట పిశాచాన్ని, దాన్ని అరికట్టవల్సిన బాధ్యతను గురించి మాట్లాడాను. ఆయన వెంటనే ఆ పిశాచాన్ని ఊరినుంచి పారద్రోలతానని వాగ్దానం చేశాడు. ఆ సాయంత్రమే నలుగురు పోలీసుల్ని వెంటబెట్టుకొని పేకాట ఆడే ప్రదేశాల అన్నింటిపైనా దాడి జరిపాడు. అందర్నీ పోలీసు స్టేషనుకు తీసుకువచ్చాడు. కాని కొంతమంది గ్రామ ప్రముఖులు ఆయన "మంచితనం" ఆసరాగా చేసికొని తప్పించుకోకపోలేదు.

అట్టివారిలో మా పంచాయితీబోర్డు ప్రెసిడెంటు, ఇద్దరు మెంబర్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, ఎల్. ఎఫ్, డిస్పెన్సరీ కాంపౌండరు, హైస్కూల్ టీచరు, మున్సబుగారి అబ్బాయి ఉన్నారు. వాళ్ళని సబ్ ఇన్‌స్పెక్టరు ఎందుకు దయదల్చి విడిచి పెట్టాడో నాకు అర్థంకా లేదు.

తర్వాత వారంరోజులకు మళ్ళీ నేను మా వూరురాగా, మామూలు ప్రదేశాల్లో పేకాట జోరుగా సాగుతోంది. నాకు ఆశ్చర్యమేసింది. సబ్ ఇన్‌స్పెక్టరు దగ్గరకు నేను వెళ్ళబోతుంటాగా మా మామయ్య అన్నాడు.

"నీ పిచ్చి ఆరాటం కాకపోతే, ఆయన మటుకేం చేస్తాడు ! మొన్న దాడిలో ఆయనకు మొత్తం పద్దెనిమిది వందల రూపాయలొచ్చాయి. నలుగురు పోలీసులకు నాలుగొందలిచ్చి మిగతా డబ్బు కాస్తాతన జేబులో వేసికొని అందర్నీ ఇళ్ళకు పొమ్మన్నాడు. ఆ మరునాటి నుండి మళ్ళీ పేకాట మొదలు. పట్టుకుంటే దగ్గరున్న డబ్బులే పోతాయి గాని, జైలుశిక్షేమీ పడదనే ధీమావుంది అందరికీ. అందుచేత ఇప్పుడు పేకాట ఆడేవాళ్ళంతా తమ దగ్గర ఎక్కువ పెట్టుకోకుండా జాగ్రత్త పడుతూ ఆడుతున్నారు.